# తోలుగుడ్డలు

ఇప్పటికి నాల్రోజులుగా అవే అలవరుసలు. 'ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం- మూడు వందల ఇరువైమూడూ పాయింట్ ఆరుమీటర్లు అనగా తొమ్మిది వందల ఇరవైయ్యేడు కిలోహెర్ట్జ్‌పై బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం సందర్భంగా ... వాతావరణ హెచ్చరికల కేంద్రం అందజేసే సమాచారం రాత్రి తెల్లవార్లూ వింటారు' స్పెషల్ అనౌన్స్‌మెంటు అనంతరం 'నిలయంలో సమయం పదిగంటలు కావస్తూ వుంది. ఇప్పుడు డోలు వాయిద్యం వింటారు'...

ఊరు నిదురపోయేవేళ నిద్రరాకో ఏమో విశ్వనాథం రేడియో పట్టుకొని వీధి అరుగెక్కాడు. చుట్ట ముట్టించి పొగను గుప్పుగుప్పున వదిలి గుండెల్ని వెచ్చబెట్టుకున్నాడు. శివరాత్రిదాక వుండాల్సిన చలి సంక్రాంతితో ఆగిపోయింది. ఇదిగో నాల్రోజులుగా మళ్ళీ మేఘాలెత్తిన్నుంచి...

విశ్వనాథం భార్య సరస్వతమ్మ మనుమలకి దుప్పటి కప్పి పక్కమీద వాలింది. పక్కనేవున్న పెద్ద కూతురు శాంతని చూసింది, ఆమె అప్పటికే నిదురపోతున్నట్టుంది. లోపలగదిలో లైటు వెలుగు తలుపు సందుగుండా పడి ఆ గది నుంచి ఈ గది దాక పొడవాటి గీత గీసినట్టువుంది. నాల్రోజులుగా ఆగీత కాల్చిన ఇనప పుల్లలా వుండి ఎక్కడో వాతలు పెడుతున్నట్టే...

అదే సమయం... మూసిన తలుపులు తెరుచుకోకుండానే... ముంగిట్లోకి వచ్చిన మాటలు? కాదు, గుసగుసలుగా ప్రారంభమై గొంతు పట్టని కేకలు. ఏదో పెనుగులాట... ఆగక పేలాపన.. తిట్లు! పోట్లు?!... మాటకి మాట... ప్రశ్నకి ప్రశ్న.. ఉక్రోషం... ఉప్పెన.. దుఃఖం... గండి...ఏడుపు... కాపురం!

ఆపే శక్తి తలుపులకు లేదు. కాపురం చప్పుడు వినిపిస్తోంది. విశ్వనాథం ఇంట్లోకి చూసి, వీధిలోకి అటూ ఇటూ చూసి రేడియో సౌండ్ పెంచాడు. చెవుల నిండుగా డోలు వాయిద్యం.. ఆ వాయిద్యం కన్నా మరేదో వినిపిస్తూవున్నా- వీధంతా డోలు వాయిద్యమే వినిపించడం కోసమన్నట్టు కూర్చున్నాడు.

సరస్వతమ్మకు లేచి కూర్చుంది. ఆమె గుండె చప్పుడికి అంతా ఎక్కడ లేచి పోతారోనని భయపడినట్టుగా చూసింది. పెద్దకూతురు శాంత దుప్పటిలో కదలడం ఇంకా నిదురపోలేదనే తెలుస్తూవుంది. మాట్లాడుకోకపోయినా ఒకర్నొకరు చీకట్లోనే చూసుకున్నారు. కాపురపు గోపురం కూలుతుంటే తట్టుకోలేక తలుపుదాక వెళ్ళిన సరస్వతమ్మ తలుపు తట్టడానికి భయపడి అలాగే వెనక్కి వచ్చింది.

సరస్వతమ్మ ఏం చేయాలో తోచక వీధి అరుగు వరకూ వెళ్లింది విశ్వనాధాన్ని ఏదో అనబోయింది. అతగాడు అటూ ఇటూ చూసి పెదవిచప్పరించి ఇంట్లోకి చూపిస్తూ పోయి పడుకోమన్నట్టుగ తలాడించాడు. సరస్వతమ్మ ఇంకా నిలబడేదేమోగాని మనుమరాలి ఏడుపు విని ఇంట్లోకి పరిగెత్తింది.

శాంతి ఆ రెండేళ్ళ పిల్లని ఊరడించి జోకొట్టబోయినా ఫలితం లేకపోయింది. ఆ పిల్ల లేచి కూర్చుంది.

"చిన్నా ఏమయిందే?" సరస్వతమ్మ అడిగి మనమరాల్ని అక్కున చేర్చుకుంది. ఆపిల్ల ఒడిదిగిపోతూ "చిచ్చికొస్తందే అమ్మా..." అంది ఏడుపు ఆపి, కడుపు బిగబెట్టి.

తల్లీకూతుళ్ళిద్దరూ ఆపిల్లని పెరటికి తీసుకుపోయి కూర్చో పెట్టారు. "నీళ్ళ విరోచనాలేం... ఏడెనిమిది సార్లు అయినట్లుంది కదామ్మా.." శాంత తల్లితో అంది.

"ఎన్నిసార్లయితే ఏటి చేస్తాం? అప్పుడుకీ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళినాం... మందులూ ఇంజిక్షన్లు ఏయించినాం... అభగవంతుడిదే బారం..." అంది సరస్వతమ్మ. 'తగ్గిపోతుందిలే' ధైర్యం చెప్పింది శాంత.

పిల్లదాని ముడ్డి కడుగుతుంటే చీరని ఈడ్చుకుంటూ పరుగు పరుగున వచ్చింది సుగుణ. ఒక్క క్షణమాగి ఆ పిల్లని ఎత్తుకొని మళ్ళీ, పరుగులాంటి నడకతో వెనుదిరిగింది. వెంటే సరస్వతమ్మ, శాంత నడిచారు. పరిగెత్తారు. సుగుణని ఆ పిల్ల 'అమ్మా..అమ్మా..' అని మెడక్కరుచుకుపోయింది. సుగుణ 'ఆ గది' తలుపులు తోసుకుంటూ లోపలికి వెళ్ళింది. శాంత, సరస్వతమ్మ ఆగది ద్వారం దగ్గరే ఆగిపోయారు. మరుసటి క్షణంలోనే తలుపులు మూసుకున్నాయి. పెద్ద కూతురూ తల్లీ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"... కళింగ పట్నానికి ఆగ్నేయంగా నాలుగువందల ఇరవై కిలో మీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమైవుంది. దీని ప్రభావం వల్ల కొస్తా తీరం వెంబడి ఎనభై నుండి వంద కిలోమీటర్లు వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఇందువల్ల చెట్లు కూలి పోవచ్చు. పక్కా ఇళ్ళకు నష్టం వాటిల్లవచ్చు, మూడో నెంబరు ప్రమాద సూచిక ఎగురవేసారు. మత్స్యకారులు సముద్రం మీదికి పోరాదని.." రేడియో చెపుతూనే వుంది.

పిల్లదాని ఏడుపు. సుగుణ అరుపులు. ఆమె పెనిమిటి ప్రసాద్ కేకలు. ఈదురుగాలి 'ఓవ్' మని అరుస్తూ ఆగదిలో తిరుగుతున్నట్టే వుంది. ఆగాలి ఉధృతికి ఏవో పడుతున్న చప్పుడు.

మత్స్యకారుల్లా నిలబడిపోయిన శాంత, సరస్వతమ్మ సముద్రంలోకి పోవడానికి సాహసించలేదు. వీధిలో విశ్వనాథం రేడియో వింటూనే వున్నాడు, వినిపిస్తూనే వున్నాడు. కిటికీల రెక్కలు కొట్టుకున్నాయి. గడియ వేసిన తలుపులూ గడగడలాడాయి. గాలీ వర్షమూ చెలిమి చేసినట్లు పడుతూ లేస్తూ పరుగతీస్తున్నాయి. తుంపరతో కూడిన ఈదురు గాలి కెరటం ఒకటి విశ్వనాథం ముఖం మీద గుద్దింది. అతగాడు లేచి ఇంట్లోకి నడిచాడు. ఈదురు గాలి వెన్నంటే వచ్చింది. గోడలకున్న కేలండర్లు ఎగిరిపడుతున్నాయి. 'తొలుగు మీది బట్టలు జారిపోతున్నాయి..'

వీధి దీపాలతో పాటు ఇంట్లోని దీపాలూ ఆరిపోయాయి. కరెంటు ఆగిపోయింది. రేడియో మూగబోయింది. దాని గొంతు గరగరమనడంతో నోరు కట్టేసాడు విశ్వనాథం.

ఎక్కడి వాళ్లక్కడ గప్ చిప్...

★ ★ ★

గప్ చిప్ సోడా కప్... కాదు, గప్ చిప్ లేదు... సోడా కప్ తెరిచిన శబ్దం... తెల్లవారింది... కలలా కరిగిపోయిన రాత్రి... కళకళలాడుతూ వెలుగు.. ఆ వెలుగు ఆ ఇంట్లోనూ...

"లాల పోసుకుందురు రండర్రా.." శాంత స్నానాల గదిలో నీళ్ళు పెడుతూ కేకవేసింది. ఆమె మాట వినిపించనట్టే పిల్లలిద్దరూ బోసి మొలలతో ఒకరి వెంట ఒకరు పరిగెడుతున్నారు.

కుడితికోసం వీదరగు మీద నిలబడ్డ చంద్రమ్మ.."సరస్వతమ్మా... నీ మనవలిద్దరు కడిగిన ముత్తివుల్లాగ ఆడుకుంతన్నారే... నా పాడుకళ్ళ దిష్టే తగలగలదు, ఐనాక దిగదుడిసీ" అంది పెద్దసిలవరితపేలా కింద పెడుతూ...

సరస్వతమ్మ గెంజీ గడుగూ తెచ్చి చంద్రమ్మ తపేలాలో పోస్తూ "ఆడా.. ఎండొంగబద్దలాగ నాలుగు సంవత్సరాలు గుద్దకిందేసినాడు.. తీములాగ గెంతడమూ ఎగరడమేగాని ఒకముద్ద తినడు. అదిగో ఆడిచెల్లి చూడు... ఆడికి పోటీ అది... అదొక రవ్వ తింతాదంతే రెండ్రోజులయిన విరోసనాలు... డాక్టరుకీ చూపించినాం..." చెపుతూ వుంటే చంద్రమ్మ అందుకుంది...

"కట్టేస్తాది... కట్టేస్తాది. పిల్లలంటే అంతే.. ఆలతోటి అన్ని పత్రాకులూ పడాల. పియ్యతినక పిల్లదక్కదు.. మన్నుతినక మనవు దక్కదు. అయినా మీ సుగుణమ్మకేమి బంగారంబతుకు..." చంద్రమ్మ అంటున్న మాటలు సరస్వతమ్మకు ఎప్పుడూ వింటున్నవే అవాళే కొత్తగా వింటున్నట్టు ఆలోచనలో పడిపోయింది. సుగుణ గురించే సుడులు తిరుగుతున్నవి ఆమె ఆలోచనలు. సుగుణ చిన్నది. సంతానంలో ఆఖరుది. పెళ్ళయి అయిదేళ్ళయింది. బంగారపు తునకల్లాంటి ఇద్దరు పిల్లలు.. ఒక ఆడపిల్ల.. ఒక మగ పిల్లడు. ముచ్చటైన కుటుంబం... అల్లుడుకి గవర్నమెంటు ఆఫీసులోనే ఉజ్జోగం...

"అమ్మా... పెద్దాని పిల్లలేరి? ఆయమ్మ పెనిమిటి వచ్చినాడు గావాల..... అప్పిడే ఎలిపోండా?..... రొన్నాలకయినా దేశదేశాలంట వున్నోలందరు...... మీయత్త సచ్చిపోయి అందర్నోక్కాడకి కలిపింది." చంద్రమ్మ ప్రశ్నలకు సమాధానం రాకపోయినా తనకు తెలిసిన కబుర్లన్నీ మాట్లాడుతోంది.

శాంత తల్లిని లోపలికి పిలుస్తూ, వదలని చంద్రమ్మకు చెప్పే కదిలింది. పిల్లలకు పెద్ద చదువుల వల్ల 'కార్యం' అయిన వెంటనే వెళ్ళిపోయారని, వాళ్లకి తోడుగా తన పెనిమిటి వెళ్ళిపోయినట్టున్నూ, చెల్లెలు సుగుణని చూసి, కలసి చాల్రోజులయిందని- అందుకే నాల్రోజులు కలిసి గడిపి పోదామని వున్నట్టు చెప్పింది.

"అప్పజెళ్ళెల్ల సోబత్తు అది గదిగలాగుండాల" మెచ్చుకుంటున్న చంద్రమ్మను చూస్తూ అరుగుమీద కొచ్చి నిలబడ్డారు పిల్లలిద్దరూ.

పెద్దాడు బోడిమొలతో నిబడ్డం చూసి "ఏ వూరి సీమ్మిరప్పండమ్మా ఇంత ఎర్రగున్నాది.?" అంటూ వాడి బుల్లి పండునిచేత్తో తడిమి ముద్దులాడింది చంద్రమ్మ. వాడు అలవాటుగా ఇచ్చేసి అలాగే నిల్చున్నాడు.

మనవడ్నీ... మనవడి బుల్లిపండునీ చూసిన సరస్వతమ్మకు నిస్సత్తువపోయి ఉత్సాహమూ ముంచుకొచ్చి... "ఇది చింతలొలస సీమ్మిరప్పండు కాదు.. సీతానగరం సీమ్మిరప్పండు... నా బంగారుపు గిలకిది.. నా వెండి పాలకాయిది..." వాడి పుచ్చపండుని చేత్తోకాదు. నోటితోనే ముద్దులాడింది. ఒళ్ళంతా చప్పరించి కొరికేసినట్టుగానే పండునీ.

వాడు గర్వంగా నిల్చున్నాడు. కొద్దిగ సిగ్గుపడుతూనే నవ్వుతున్నాడు. చిన్నది. వాడి చెల్లెలు బోడి మొలతో, అంతదాక పక్కపక్కనే నిలబడి వుండి ముందుకొచ్చింది.

"ఏమే సిత్తరాంగీ... నీ సిగ్గుబిళ్ళేదే? చంద్రమ్మ ఏకంగా ఆపిల్లనే అడిగింది. సరస్వతమ్మ తననే అడిగినట్టు... "ఉందమ్మా.. వుంది, వెండి బిళ్ళ చేయిస్తే ఆల తాత.." అంటూ ఆ పసిదాని మొలతాడు చుట్టూ దేవి, దొరకబుచ్చుకొని ఆ పిల్ల మానం కప్పి- ప్రాణం నిలబెట్టినట్టు చూసింది. 'ఈ పిల్లకి సెడ్డీ ఎయ్యర్రా' ఇంట్లోకి కేకలేసింది సరస్వతమ్మ.

అప్పుడే అల్లుడు ప్రసాదు వీధిలోంచి వస్తూ- అరుగెక్కుతునే "చిన్నా.. వెళ్ళు వెళ్ళి డ్రాయరేస్కో అమ్మా.. డ్రాయర్ లేకుండా వుండకూడదు... తప్పు.. "బుజ్జగింపులో లాలన కన్నా కటువే ఎక్కువుంది.

"... నేనే స్నానం చేయిద్దామని బట్టలు తీసాను..." సంజాయిషీ ఇస్తున్నట్లు అనేసి, తన పమిట కొంగుతో ఆపిల్ల మొలకప్పి గబగబా ఇంట్లోకి తీసుకుపోయింది శాంత.

"డాడీ... అంటూ పెద్దాడు తండ్రి చెయ్యి పట్టుకొని దర్జాగా ఇంట్లోకి నడిచాడు. సరస్వతమ్మ నెమ్మదిగా ఇంట్లోకి నడుస్తుంటే చంద్రమ్మ తపేలా ఎత్తుకు వీధిలోకి వెళ్లిపోయింది.

శాంత పిల్లల్ని స్నానాల గదిలోకి తీసుకుపోయి స్నానాలు చేయిస్తోంది.

సరస్వతమ్మ వంట గదిలోకి దూరి వంట మొదలుపెట్టింది. సుగుణ కూరలు కోసి అందిస్తూ... తాళింపులకు ఉల్లిపాయలని కోస్తూ పనుల్లో సాయపడుతోంది. సరస్వతమ్మ కూతురు ముఖంలోకి చూడాలనుకుంది, ధైర్యం చాలలేదు. తను అలాచూడ్డం చూస్తే కూతురు తట్టుకోలేదని

అనిపించింది. అందుకే ఏం జరగనట్టే వుంది. అసలు వాతావరణంలో ఏ మార్పూ లేనట్టేవుంది. అంతా ప్రశాంతంగానే వుంది.

సుగుణ మామూలుగానే ప్రసాదు కూర్చున్న చోటికి వెళ్లి టిఫిన్ పెట్టి వచ్చింది. తరువాత మళ్ళీ టీ ఇచ్చి ఎంగిలిప్లేటు పట్టుకువచ్చింది. ఆయా సమయాల్లో సందర్భాల్లో చూడకూదనుకున్నా సరస్వతమ్మ చూపులు తెలియకుండానే వెంటాడాయి. చూపులు తనని వేటాడ్డం సుగుణ పసిగట్టకపోలేదు. సుగుణ పసిగట్టినట్టు సరస్వత్మకూ బోధపడింది. శాంత కూడా ఈ విషయాలకు దూరంగా లేదు.

సుగుణ కళ్ళలో నీళ్ళు...

సరస్వతమ్మ కళ్ళలోనూ...

శాంత పిల్లల్ని తుడుస్తూ- పరిస్థితి స్పర్శలో కొచ్చి చెల్లెలి దగ్గరగా చేరి అడగబోయింది. అడగలేదు. సుగుణా అని మాత్రమే అంది.

"ఉల్లిపాయలు.. కళ్ళు మంట.." సుగుణ కళ్ళు తుడుచుకుంది.

"ఉల్లిపాయలు.. కోసేముందు ముందుగా నీళ్ళలో నానబెట్టుకుంటే కళ్ళు మండవు.." మాట వినే అన్నాడో- వినకే అన్నాడో ప్రసాద్ వంటగదికి వినపడేలా అవతలి గదిలోంచి- పేపర్లోంచి తలెత్తకుండానే చిట్కా చదివి వినిపించాడు.

"ఎక్కడి దొంగలు- అక్కడే గప్ చిప్..." పెద్దాడు చిన్నదాని కళ్ళని తాతయ్య చేత మూయించి - అరుస్తూ- దాక్కోవడానికి పరుగుతీసాడు.

అంతా ఆటలో అరటి పండుల్లాగ- ఎక్కడి వాళ్ళక్కడ ఆటలో వున్నట్టో... దాక్కున్నట్లో సర్దుకున్నారు.

చిన్నది ఆడలేనట్టు మళ్ళీ కడుపు గుప్పు మనడంతో పెరట్లోకి పరుగుతీసింది. ఆ పరుగులో శక్తి లేదు... నడకతో తూడగం చూసి 'పడిపోతావ్' ఎవరికేకా ఆ పిల్లకి వినిపించలేదు.

సరస్వతమ్మ పెరట్లోకి వచ్చి పిల్ల పక్కనే నిలబడింది. ఆమె ఎందుకో ఆకాశంలోకి చూసింది. ఆకాశం రాత్రి అంత భయానకంగా లేకపోయినా, ఇంకా గుడగుడ మంటోంది. నల్లని మేఘాలు వెలుస్తాయో కురుస్తాయో అంచనాకీ అందడం లేదు.

'ఇంకసరి' అన్నట్లు పిల్ల 'అమ్మమ్మా' అంది. సరస్వతమ్మ ఆ పిల్ల ముడ్డి కడుగుతూ 'ఓలమ్మ ఎంత వరిసిపోయిందే' నొచ్చుకుంటూ ఇంట్లోకి తీసుకు వెళ్ళి ఎర్రగా కమిలిన భాగాన నూనె రాసింది. సొమ్మ సిల్లినట్టు ఓ మూలకు పోయి కూర్చుందాపిల్ల.

'చెడ్డీ వెసుకో'... సుగుణ డ్రాయిరు తెచ్చి వేయబోతూ- ప్రసాద్ పిలవడంతో ఆ పిల్ల చేతికిచ్చి వెళ్ళింది.

ప్రసాదు పేపర్లోంచి తలెత్తి నవ్వుతూ ... "మాకు డియ్యే పెరిగింది. ఫిఫ్త్ పే కమీషన్ వస్తే సేలరీస్ పెరిగి ఇంకా బాగుంటాయ్... ఈ నెల నుంచి మరో మూడొందలు పెరుగుతుంది..." చెప్పి ఎరియర్స్ ఎంత వస్తాయో లెక్క కట్టడం మొదలు పెట్టాడు.

"ఎంత పెరిగినా లోను తీరిందాక కష్టమే. పెరిగినా కనపడదు.. పైగా పంచదార నుండి గేసు దాక అన్ని రేట్లూ పెరిగిపోయాయి. రేషన్లోనూ బయటయితే అడగక్కర్లేదు..." సుగుణ అతగాడి లెక్కల్ని పట్టించుకోకపోయినా- పట్టించుకోవల్సినదాన్ని పట్టించుకున్నట్టే వుంది.

సరస్వతమ్మ అల్లుడూ కూతురు మాట్లాడుకోవడం చూసి తుపాను వెలిసిపోయినట్టే సంబరపడింది. ఆమెకళ్ళలో ఏవో ఆవిర్లు కమ్మాయి. మరోసారి అల్లుడూ కూతురు వంక చూసింది. శాంత వంక చూసింది. శాంతకూ వింతగానే వుంది. సరస్వతమ్మ గ్రహపాటు అనుకుంది. మొగుడూ పెళ్ళాలన్నాక తప్పవనీ అనుకుంది. తనకు తెలిసీ అల్లుడుకీ కూతురికీ మధ్యగొడవల్లేవు. అత్తపోరులేదు. మామ ఏలుబడి లేదు. అందరికీ దురంగా ఉజ్జోగం పట్టుకుని ఉన్నంతలో హాయిగానే వున్నారు. సాక్ష్యం రతనాల్లాంటి పిల్లలు. పెళ్ళయిన అయిదేళ్ళకి నాలుగేళ్ళ కొడుకు... రెండేళ్ళ కూతురు. ఏ అల్లుడికీ కట్నకానుకల్లో తక్కువ చెయ్యలేదు. కడుపులో వున్న కోరికను కోరకుండానే కంటి ముందు పెట్టే తండ్రి నా పెనిమిటి...

...ఈ నాల్రోజులుగా ఏం తగువు నలుగుతుందో తెలీదు... మొగుడూ పెళ్ళాలన్నాక అనుకుంటారు... ఆడుకుంటారు.. ఏ అనుకోవడమయినా ఆడుకోవడమయినా కళ్ళముందే జరుగుతుంటే కాదనుకోలేక పోతోంది- దూరంగా వున్నప్పుడు వాళ్ళెలాగ వుండనీ.....

సరస్వతమ్మ అదే విషయం పెద్ద కూతురుతో అంది. చెల్లి ఏం చెప్పిందా? అంది. తెలుసుకొమ్మని అడిగింది. అడిగినట్టు అడక్కుండా అడిగింది.

సరస్వతమ్మ శాంత వంటగదిలో వుండిపోయి వేరే ఆలోచనలతో వెనక బడిపోయారుగాని... ప్రసాదు ఎందుకో పడి పడి నవ్వుతున్నాడు. నవ్వి నవ్వి లుంగీతో కళ్ళు తుడుచుకున్నాడు. 'నా కవతల పనుంది' సుగుణ వంటగదికేసి వచ్చేసింది. ఆమె ముఖంలో కోపం మాత్రం లేదు.

సరస్వతమ్మ మనుమల్తో ఆడుకోవడానికి వీధిలోని ఇద్దరు ముగ్గురు పిల్లలు ఇంట్లోకి వచ్చి చేరారు. అంతా కలిసి ఆటలాడ్డం మొదలు పెట్టారు.

"... చుక్...చుక్... రైలు బండి వస్తంది

దూరం దూరం జరగండి...

ఆగిన తర్వా ఎక్కండి"... మొలమీద మొలతాడు తప్ప ఏమీ లేని పెద్దాడు 'కూ ఛుక్ ఛుక్' పరిగెడుతుంటే - వాడి మొలతాడు పట్టుకొని మిగతా పిల్లలు పాడుకుంటూ పరుగులెడుతున్నారు... చిన్నది లేచి నిల్చోని, కాళ్ళు పీకాయేమో కూర్చుంది.

"ఎవిట్రా ఒంటి మీద గుడ్డ ముక్కలుంచవు.." ఇదేం విడ్డూరమని మనవణ్ని చూసి మురిసి పోతూ విశ్వనాథం నవ్వుతుంటే వాడు చిన్నప్పట్నుంచీ అంతే.. బడిలో అయినా వుంచుతాడో లేదో..." గొప్పగా గర్వంగా అన్నాడు ప్రసాద్.

"పిల్లడికి దిష్టి..." అంది శాంత.

అందుకనే రోజూ దిగదుడమని చెప్పింది సరస్వతమ్మ. మనవడ్ని ముద్దులాడ్డం అంటే సీమ్మిరప్పండుని వర్ణించడమే ఆమెకు. సుగుణ కూడా తామున్న చోట అందరూ 'ఈ సీమ్మిరప్పండు గుంటూరుది కారమెక్కువ? అని ఇకటాలాడుతారనీ చెప్పింది. చిన్నది కూర్చున్న చోటు నుంచి నెమ్మదిగా ఆటదగ్గరికి వచ్చి అందరి దృష్టిలో పడింది.

'చిన్నా డ్రాయరు వేసుకోలేదా ఇంకా.." సుగుణ కూతుర్ని కళ్ళతోనే హెచ్చరించింది.

సరస్వతమ్మ గుబుకున్న వచ్చి ఆపిల్ల ప్రాణం కాపాడినట్టు మానం సిగ్గుబిళ్ళతో కప్పి 'ఇలా గుండదే' అని, సర్ది జరపకు... నాన్న కొట్టేస్తారంది.

"వెయ్యి డ్రాయరు.. వెయ్యి... నిన్నే ..." ప్రసాదు హెచ్చరించాడు.

చిన్న దానికి ఓపిక లేక చేతిలోంచి జారిన డ్రాయర్ని తీసిపట్టుకుందేగాని తిరిగి వేసుకోలేదు. తండ్రి అరుస్తుంటే చూసింది. "బిస్కెట్ల బండి మీద బావొస్తండు బావదుక్కు సూస్తుంతే సిగ్గేస్తంది.. పీటమీదకూసుంతె పిత్తొస్తంది..." గుంటల పాటలూ వాళ్ళ ఆటలే తప్ప మరొకటి బోధపళ్ళేదు. తల్లి హెచ్చరిక, తండ్రి అరుపులు, అమ్మమ్మ అవస్థ, తాతయ్య పిలుపూ, పెద్దమ్మ మాట ఏదీ బోధ పళ్ళేదు. అంతకంటే ఓపికలేదు..

చిన్నా'.. నోట్లోంచి కేక, కేకతో పాటు చిన్న దాని రెండు బుగ్గల మీద చరుపులు.. తూలి బోర్లాపడింది.. వీపు మీద మరో చరుపు... ప్రసాద్‌ని విశ్వనాథం సరస్వతమ్మ అడ్డుకున్నారు. శాంత ఆ పరిస్థితుల్లోనూ ఆపిల్లకు డ్రాయరు తొడిగింది.

"ఇంకెప్పుడూ డ్రాయరు తియ్యవా.. ఆఁ.. చెప్పు.. తీసావో చంపేస్తాను.." ప్రసాదు ఆ పిల్ల తొడమీద సొంటిపిక్క తీసాడు. "చెప్పు.. చెప్పు.. డ్రాయరు తియ్యనని చెప్పు.." "బట్టలు తియ్యనని చెప్పు.." ప్రసాద్ అరుస్తూనే వున్నాడు. ఆపిల్ల బాధతో దుఃఖంతో ఏడుస్తుందే కాని చెప్పమన్నట్టు చెప్పలేదు. చెప్పలేకపోయింది.

"ఆడపిల్ల ఇప్పుడే ఇలాగయితే ఎలగ..."

"మొక్కప్పుడు వంగనిది మానయితే వంగుతుందా?"

"ఇలాగే వదిలేస్తే ... ఆడపిల్ల.. మరి మనకు దక్కదు.."

మనిషిదో మాట..

ఆడుకుంటున్న పిల్లల ఆటలాగిపోయాయి. నవ్వులాగిపోయాయి. అందరూ చిన్నా చుట్టూ చేరారు. చిన్నా వెక్కి వెక్కి ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి అలసిపోయిందేమో బెక్కుతూనే వుంది. సరస్వతమ్మ పిల్లని తీయబోతే ప్రసాద్ వద్దని వారించాడు.

చిన్నది ఏడుస్తూనే- వెక్కిళ్ళు పడుతూనే- మళ్లీ డ్రాయరు తియ్యబోయింది. "ఏమిటి దీని పంతం, కొత్త నయాపైసలాగుంది... అమ్మా?" అనుకుంటూ ఆశ్చర్యపోతూ- ప్రసాద్ పట్టుదలతో గౌనుకూడా తెప్పిచి బలవంతగా తొడిగాడు. కొద్దిసేపటికి బట్టల్లో ఉచ్చపోసుకోవడమే కాదు, విరోచనం కూడా అయిపోయింది.

★ ★ ★

ఇప్పటికి నాల్రోజులుగా అవే అలవరుసలు!

"మూడువందల ఇరవై మూడు పాయింట్ ఆరు మీటర్లు అనగా తొమ్మిది వందల ఇరవయ్యేడు కిలోహెర్ట్జ్‌పై ప్రసారం.."

బంగాళా ఖాతంలో ఏర్పడ్డ వాయు గుండం బలహీనపడవచ్చునను కున్నప్పటికీ అది తీరాన్ని ఇంకా దాటకపోవడం వల్ల ఇది మరింత ఉధృతమై- ఉత్తర కోస్తా ఒరిస్సాల మధ్య తీరాన్ని దాటవచ్చని, విశాఖపట్నంలోని వాతావరణ హెచ్చరికల కేంద్రం తెలిపింది...

రేడియో వార్తల్ని... వాయిద్యాల్ని.. పాటల్ని ఒకదాని తర్వాతొకటిగా వినిపిస్తూనే వుంది. విశ్వనాథం వీధంతటికి వినిపిస్తూన్నట్టే వీధి అరుగెక్కి కూర్చున్నాడు. చల్లారిన చుట్టను వెలిగించడానికి వెచ్చబెడుతున్నట్లు - గుండెలోని వేడిగాలిని అందిస్తున్నాడు.

ఊరు ఒకపక్క నిద్రలోకి ఒదిగిపోయింది.

అదే సమయం.. మూసినతలుపులు.. లోపలగదిలో లైటు వెలుగు తలుపు సందుగండా పడి- ఆగది నుంచి ఈ గదిదాక పొడవాటి గీత గీసినట్టువుంది. నాల్రోజులుగా ఈ గీత కాల్చిన ఇనుప పుల్లలా వున్నా- ఇవాళది కూతురు నీడ పాక్కుంటూ వచ్చినట్టు అనిపించింది సరస్వతమ్మకి. ఆనీడ- కూతురు, తన పాదాల మీద పడ్డట్టే పడింది. సరస్వతమ్మ లేపలేకపోయింది. ఒడిలో చేర్చి జోకొట్టలేకపోయింది. ఊరడించలేకపోయింది.

పక్కనే చిన్నది జ్వరంతో వణుకుతోంది. ఆపిల్లపై కప్పిన దుప్పటినే మళ్ళి సర్దింది శాంత.

ఎప్పటిలాగే గుసగుసలుగా ప్రారంభమైన మాటలు. గొంతుపట్టని కేకలై... పేలాపన... పెనుగులాట... తిట్లూ..రాట్లూ...పోట్లూ..

సరస్వతమ్మ వూహిస్తున్నది. అంతకంటే నమ్మలేకపోతున్నది...

"...లేదక్కా.. మా మధ్య గొడవలేం లేవు. కాని ఎప్పుడూ ఒక్కటే... ఆఒక్కటీ నన్ను రాత్రంటే భయపెడుతోంది... తలుపులుమూస్తే వూపిరి సలపనట్టే వుంటుంది. నాకూ ఇష్టమే.. కావాలనే వుంటుంది... కానీ..."

కలిసి పెరిగిన స్నేహంచేత సుగుణ ఎట్టకేలకు గుండె విప్పి చెప్పింది శాంతకి. తల్లితో చెప్పుకోలేనిది అక్కకు చెప్పుకుంది. అమ్మకి కాక ఎవరికి చెప్పుకొనేదని సుగుణకు తెలీయకుండా (?) శాంత తల్లికి చెప్పింది. అలా ఒకరికి తెలీకుండా ఒకరికి... ఇంకొకరికి... ఇంటిల్లి పాదికీ తెలిసిపోయింది.

అలా తెలిసిపోయినందువల్ల వాళ్ళంతా గదిబయటే వుండి లోపలికి వెళ్ళగలిగారు.

"ప్లీజ్... పూర్తిగా తీసేయ్ః..."

జారిన చీరకొంగును జారనివ్వకుండా పట్టుకుంది సుగుణ.

"మనిద్దరం భార్య భర్తలం.. ఇక్కడ మనిద్దరం తప్ప ఎవ్వరూ లేరు. స్వేచ్ఛగా వుండు... స్వచ్ఛంగా వుండు..."

"ఆడపిల్లకు.. అందులో వయసొచ్చిన ఆడపిల్లకు స్వేచ్ఛ ఇవ్వకూడదు. పాడయిపోతారు. ఫలాన వాళ్ళ పిల్ల ఇలాగ అంటారు. ఎంతడబ్బు పోసినా చేసుకోవడానికెవరూ ముందుకు రారు.. గట్టు తెగిపోతే నీళ్ళుండవు.. బతుకుండదు.." వీదరుగు గుమ్మం మీద కూచొని- అక్కణ్నుంచి వచ్చి సుగుణ గుండెల మీద కూచొని విశ్వనాథం చెప్పడం ప్రసాద్‌కు వినిపించలేదు. సుగుణ పమిటలాగి తలవాల్చేడు ప్రసాదు...

రొమ్ములు ఘొనదేలాయి... రొమ్ములయినందుకు మొనలున్నాయి. మొనలున్నందుకు బొడిపెలు... బట్టలతో బంధించినా అందరి చూపుల్తో అమ్మచూపు.. ఆడపిల్లవి.. పైట జారనీయకు.. సరిగ్గా కప్పుకో గుండె అగ్గసం... బిగుతుగా కట్టుకో... వంగినా వాలినా జాగ్రత్తగా వుండు సుమా... బ్రహ్మపదార్థం... పరబ్రహ్మకయినా కంట పడకుండా నిత్యం.. బతికినంత కాలం పైట (వదులుకోకు)... సర్దుకో' మంటూ పదేపదే సర్దే అమ్మ... పమిటతీసి గుండెల నిండా కప్పింది- ఇలా గదిలో కొచ్చి సరస్వతమ్మ సర్దడం గమనించలేదు ప్రసాదు.

"ఎందుకలా నోరుకట్టేసుకుంటావ్... నవ్వకపోతే లేదు... ఏదైనా మాటాడు.." ప్రసాద్ గింజులాడుకుంటున్నాడు.

"నోర్మూయ్యి అన్నిట్లో దూరిపోతావ్... ఆడపిల్ల నవ్వు పెదవి దాటకూడదు. అడుగు గడపదాటకూడదన్నారు... ఎందుకన్నారో తెలుసా? నువ్వు నీ పరుధుల్లో వుండొచ్చు. అవతలి వాళ్ళు చనువు తీసుకుంటే?!... నోఁనోనో..." కొట్టిపారేసే అన్నయ్య టెలిగ్రామ్ కొట్టినట్టు పది ఊర్లవతలనుండి వచ్చి గదిలో కూర్చున్నాడు.

"నిన్ను నేను ఎలా వాటేసుకుంటానో.. నువ్వు కూడా అలాగేవచ్చి నన్ను వెనుక నుండి అప్యాయంగా ప్రేమగా పట్టుకోరాదూ?..." ప్రసాదు పట్టు వదలడం లేదు.

"అక్కా... నన్నొదులు... వదల మంటుంటే, నీ పెన్సిలూ రబ్బరూ నీది నీకిచ్చేస్తాను. సిగ్గుందా? ఆడపిల్లవి అమాంతం అలా పట్టుకోవచ్చా.. ఛి ఛీ.." వచ్చీరాని గుండెమీద కనపడీ కనపడని నూనూగుమీసాల తమ్ముడు కళ్ళతో వుమ్మేశాడు.

"ఛీ ఛీ.. ఎంత బతిమలాడిన బండరాయిలా చలనం లేదు... మనిషివేనా నువ్వు? పశు పక్షాదులకున్న పాటిలేదు..."

ముఖం మీద వుమ్మేస్తే తుడుచుకుంది సుగుణ.

"సెక్సులో ఇద్దరి పార్టిసిపేషనూ వుండాలి. వాత్స్యాయుని పాఠం విను.." ప్రసాద్ మొదలెట్టాడు... "ముందు నా పాఠం విను నా అనుభవంతో చెపుతున్నాను. నీ కోరికలను కట్టుకో, అతడే విప్పుతాడు. నువ్వు విప్పావో నా మొగడులాగే నీ మొగుడూ అనుమానిస్తాడు. లేదు నిన్నొక కామ పిశాచిలా చూస్తాడు..." అక్క శాంత కూడా తనవంతు జాగ్రత్తలు చెపుతోంది.

"గదిలో ఇంత మంది ముందు వివస్త్ర కావాలా! నా వల్ల కాదు గాక కాదు".. తనలో తనే గొణుక్కుంటూ భయంగా బట్టని మరింతగా కప్పుకుంది. చలికి వణుకుతున్నట్టు కప్పుకుంది.

'నన్ను అప్సెట్ చెయ్యకు... రెచ్చగొట్టకు.. ఒక్కసారి నిన్ను నగ్నంగా.. న్యూడ్‌గా చూడాలి.. ప్రసాద్ సుగుణ వంటి మీద చీరను బలంగా లాగాడు. సుగుణ పట్టూ సడలింది. చీర చిరిగింది.. చేతి కొచ్చింది....

"మొత్తం తీసేయ్... ప్లీజ్.. చెప్తే నీక్కాదూ.. తీస్తావా లేదా నిన్నూ...' సుగుణ చెంప చెల్లుమంది. అరవడం.. గదిలోంచి పారిపోబోవడం... గోళ్ళతో రక్కడం.. ప్రతి ప్రయత్నానికీ ఒక్కో దెబ్బ పడింది.

ఐదు వేళ్ళూ అంటుకుపోయాయి.

ఆ అచ్చుల్ని చిన్నదాని లేత బుగ్గల మీద సరస్వతమ్మ తడిమింది. వీపు మీదా అదే దెబ్బ పిచ్చిరేగినట్టు కొడుతున్నాడు ప్రసాద్.

"ఇకనైనా బట్టలు విప్పుతావా లేదా?" కొడుతూ అడుగుతున్నాడు.

"కొట్టకు నాన్నా.. ప్లీజ్ నాన్న... మరెప్పుడూ బట్టలు విప్పను. విప్పితే కొట్టు.. డ్రాయరు తీస్తే చంపేయ్... ఇంకెప్పుడూ డ్రాయరు తియ్యను. పాస్‌కొచ్చినా చిచ్చికొచ్చినా తియ్యను తియ్యను గాక తియ్యను.." ఇంచు మించు అలాంటి మాటలతో అభ్యర్థిస్తూ- నిలువెల్లా వణికిపోతూ వున్న పిల్లదాన్ని చూసి గదిబయట సరస్వతమ్మ. శాంత అర్థం కానట్టు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

చిన్నది రెండు చేతుల్తో డ్రాయర్ని గట్టిగా పట్టుకొని ఇంకాపైపైకి నిద్రలోనే ఎగేసుకుంటోంది. లేత చర్మం మీద సిగ్గు బిళ్ళ గచ్చుకుంటున్నా ఆగడం లేదు.

పక్కనే వున్న పెద్దాడి సీమ్మిరప్పండు ఏ ఆచ్ఛాదనా లేక- అన్ని అవయవాల్లాగే నిర్బంధమూ నియంత్రణా లేక హాయిగా నిదురపోతోంది!

★ ★ ★

*ప్రచురణ : వంశధార కథలు (శ్రీకాకుళ సాహితి) ఫిబ్రవరి 1999*

***రచనా కాలం :** 7,8, ఫిబ్రవరి 1999.*